క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ పరికరాల వితరణ



పరికరాలను అందిస్తున్న సర్పంచ్ సూర్యకుమారి వరహాలు

రావికమతం: కవగుంట సర్పంచ్ దారి సూర్య కుమారి వరహాలు దాతృత్వం చాటుకున్నారు. తమ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు, గడియారం, ఫ్యాన్, విద్యుత్ పరికరాలను గురువారం ఆమె వితరణగా అందించారు. తన భర్త వరహాలు సహకారంతో మొదటి నుంచి పలు సేవా కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన సమయంలో అక్కడి సమస్యలను కార్యకర్త గూడెపు వెంకటలక్ష్మి విన్నవించగా, పరికరాలను సమకూర్చారు.

పది వరకు అప్‌గ్రేడ్ చేయడంపై హర్షం



మధును సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు

నర్సీపట్నం: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం అప్‌గ్రేడ్‌కు కృషి చేసిన జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధు, ఎం.అప్పలరాజును దళిత సంఘాల నాయకులు చిట్ల చలపతిరావు, గంగరాజు, తమ్మిల స్వామి, దాసు సత్కరించారు. పదో తరగతి వరకు వసతి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని చలపతిరావు పేర్కొన్నారు. మోనటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకుని పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయటంపై హర్షం వ్యక్తం చేశారు.

అన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న గొల్లవిల్లి రాజేశ్ దంపతులు

మాడుగుల రూరల్/బుచ్చెయ్యపేట: వడ్డాది వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు సందర్భంగా ఆలయం వద్ద ఉచిత అన్నదాన కార్యక్రమానికి దాతలు విరాళాలు అందజేస్తున్నారు. ఎం. కోడూరు పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేశ్, వరలక్ష్మి దంపతులు రూ.10 వేలు గురువారం ఉత్సవ కమిటీ సభ్యుడు నాగేశ్వర రావుకు అందజేశారు.

డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలు



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ రాజు

నర్సీపట్నం: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.రాజు ప్రారంభించారు. ఎల్ఐసీ వ్యాపార దృక్పథంతో కాకుండా విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు క్విజ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అధ్యాపకులు తెలిపారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 8న బహుమతులు అందజేస్తామని ఎల్ఐసీ ఫెడరేషన్ నర్సీపట్నం బ్రాంచ్ అధ్యక్షుడు దేవాడ సత్యనారాయణ పేర్కొన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయుని దర్శించుకుంటున్న భక్తులు

చోడవరం/రూరల్: మైచర్లపాలెంలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయుని భక్తులు, భజన గురువులు, గ్రామ సర్పంచ్ బూరె మాణిక్యం ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ అర్చకులు పారుపూడి వెంకట సత్యనారాయణ మూర్తి, ఏఆర్‌జీ శర్మ, ఆర్లి కనకారావు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడికి చెక్

- నర్సీపట్నం మున్సిపల్ అధికారుల ప్రత్యేక కార్యాచరణ
- రూ.20 లక్షలతో వేసవి ప్రణాళిక సిద్ధం



దుగ్గాడ ఊటబావుల వద్ద నీటి నిల్వలు



తాగునీటి కుళాయిల వద్ద మహిళలు



ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

నర్సీపట్నం: మున్సిపాలిటీలో వేసవి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల కనీస అవసరాల్లో తాగునీరు కల్పన ప్రధానమైంది. ప్రస్తుతం ప్రజలకు సరిపడా తాగునీటి అవసరాలను తీరుస్తున్నారు. భవిష్యత్తులో ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో రూ.20 లక్షలతో వేసవి ప్రణాళిక సిద్ధం చేశామని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

అప్పట్లో 30 వేల జనాభా తాగునీటి అవసరాలకు అనుగుణంగా వరహానదిపై దుగ్గాడ ప్రాజెక్టును నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం పట్టణ జనాభా 65 వేలకు పెరిగింది. వీటిరి తాగునీటి అవసరాలను తీర్చేందుకు రోజూ గంట పాటు నీటిని సరఫరా చేస్తున్నారు. నీటి నిల్వను పెంచేందుకు దుగ్గాడ ఊటబావుల వద్ద ఇసుక బస్తాలు, సిమెంట్ దిమ్మలు అడ్డంగా వేశారు. పెదబొడ్డేపల్లి థెరిసా కాలనీ, అయ్యన్నకాలనీ, కృష్ణాపురం ప్రాంతాలకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అవసరం మేరకు ట్యాంకర్లను పెంచనున్నారు.

పూర్తిస్థాయిలో అందని నీరు...

పట్టణంలో 65 వేల మంది జనాభా నివసిస్తున్నారు. వీరిలో సగటు మనిషికి రోజూ 80 లీటర్ల చొప్పున సరఫరా చేయాల్సి ఉంది. ఈ విధంగా రోజుకు 6.0 ఎంఎల్‌టీ (మిలియన్ లీటర్లు) నీటిని సరఫరా చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 3.25 ఎంఎల్‌టీ నీటిని సరఫరా చేస్తున్నారు. రోజుకు ఒక్కో వ్యక్తికి 40 లీటర్లను అందిస్తున్నారు. 28 వార్డుల్లో 1,200 పబ్లిక్ కుళాయిలు, 320 చేతిపంపులు ఉన్నాయి. గంటకు మించి నీటి సరఫరా చేయకపోవటం వల్ల అందరికీ పూర్తిస్థాయిలో నీరు అందటం లేదు. 320 చేతిపంపులున్నాయి. వీటి ద్వారా గృహ, తాగునీటి అవసరాలను తీర్చుకుంటున్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వం..



వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. తాగునీటి అవసరాలకు రూ. 20 లక్షలకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఉత్తరవాహిని, దుగ్గాడ బోర్‌వెల్స్ వద్ద నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల నీటిని సరఫరా చేస్తాం.

– కె.కనకారావు, కమిషనర్, నర్సీపట్నం మున్సిపాలిటీ

పట్టభద్రులంతా సుధాకర్‌ను గెలిపించాలి

- ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



బుచ్చెయ్యపేట: వడ్డాదిలో ప్రచారం చేస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



మాకవరపాలెం: నమూనా బ్యాలెట్ పత్రాలు చూపుతున్న ఎమ్మెల్యే గణేష్, నాయకులు

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్ర అభివృద్ధికి వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా మండలంలోని వడ్డాది, కొమళ్లపూడి, పొట్టిదొరపాలెం, బుదిరెడ్లపాలెం తదితర గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి ఆయన గురువారం ప్రచారం చేశారు. వెనకబడిన ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించారన్నారు. పట్టభద్రులంతా ఏకమై సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి జగనన్నకు కానుకగా అందించాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్ధనరావు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు కోరుకొండ సూరి అప్పారావు, రమణ, తమరాన శ్రీను, వేపాడ మధు, తమరాన రమణ పాల్గొన్నారు.

సుధాకర్ గెలుపే లక్ష్యంగా... : ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పిలుపునిచ్చారు. రామన్నపాలెంలో వైఎస్సార్‌సీపీ నేతలతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఓటర్ల సంఖ్య, తదితర అంశాలపై నాయకులతో సమీక్షించారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పెట్ల భద్రాచలం, బొడ్డు గోవిందరావు, చిటికెల రమణ, హరిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి కోరారు. రైవాడ శివారు బేతపూడి కేజీబీవీలో ఉపాధ్యాయినులను కలిసి ఎన్నికల కరపత్రాలను అందజేసి అభ్యర్థించారు. కొప్పుల వెలమ, కల్లుగీత కార్మికుల కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, సిమ్మ అప్పన్న, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, కె.వి.రమణ, చల్లా నాయుడు, రమాదేవి, కొరుప్రోలు శ్రీను పాల్గొన్నారు.

గొలుగొండ: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ ఏఎల్‌పురం, గొలుగొండ, చీడిగుమ్మల, కృష్ణదేవిపేట గ్రామాల్లో పార్టీ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

చీడికాడ: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలంటూ మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ మండల నాయకులు గురువారం ప్రచారం చేశారు. పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి ఈర్లె చైతన్య, చీడికాడ గ్రామ శాఖ అధ్యక్షుడు పరవాడ మహేష్ పాల్గొన్నారు.

మాడుగుల: మండలంలోని ఒమ్మలి, గాదిరాయి, జమ్మాదేవిపేట, ఎం. కృష్ణాపురం, వీజేపురం గ్రామాల్లో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పార్టీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అభ్యర్థించారు.

గొంప కొండపై ఆలయానికి నీటి సౌకర్యం

పైడిమాంబ ఎంప్లాయీస్ అసోసియేషన్ కృషి



కుళాయిలను ప్రారంభిస్తున్న సర్పంచ్ గోవింద్, అసోసియేషన్ సభ్యులు

రావికమతం: గొంపలో పలు సేవా కార్యక్రమాలు చేస్తూ మన్ననలు పొందిన పైడిమాంబ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు మరో మంచి కార్యక్రమం చేపట్టారు. స్థానిక కొండపై భీమలింగేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకునే భక్తులకు తాగునీరు సౌకర్యం లేదు. కనీసం అక్కడ కాళ్లు శుభ్రం చేసుకునేందుకు సైతం చుక్కనీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన సొసైటీ సభ్యులు కొండపై వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయడమేకాక భక్తులకు కుళాయిలు ఏర్పాటు చేశారు. సర్పంచ్ కంట్రెడ్డి గోవింద్ వీటిని గురువారం ప్రారంభించారు. సభ్యులను అభినందించారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ



గ్రామంలో విచారణ చేస్తున్న ఎస్ఐ విభీషణరావు

రావికమతం: గంపవానిపాలెంలో రహదారి ఆక్రమణపై కలెక్టరేట్ స్పందనలో గ్రామానికి చెందిన మాకిరెడ్డి రమణ చేసిన ఫిర్యాదు మేరకు కొత్తకోట ఎస్ఐ విభీషణరావు, వీఆర్వో దేవకాంత గురువారం విచారణ చేపట్టారు. తమ ఇళ్లకు రాకపోకలు లేకుండా రహదారికి అడ్డంగా కొంత మంది నిర్మాణం చేపట్టారని ఫిర్యాదు చేశారు. ఆ మేరకు అక్రమ నిర్మాణదారులతో మాట్లాడిన ఫలితం లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి పోలిరెడ్డి నోటీసులు జారీ చేశారు.

నేటి నుంచి పెద్దింటమ్మ తల్లి ఉత్సవాలు



గోడ పత్రికను విడుదల చేస్తున్న వైస్ ఎంపీపీ సన్యాసినాయుడు, కమిటీ చైర్మన్ అప్పలనాయుడు

రోలుగుంట: కుసుర్లపూడిలో శుక్రవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు పెద్దింటమ్మతల్లి ఉత్సవాలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన గోడ పత్రికను గురువారం వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ మడ్డు అప్పలనాయుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు అవసరమైన ఏర్పాట్లతోపాటు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. ముగింపు రోజు రాత్రి నృత్యాలు, మేళతాళాలతో అమ్మవారి ఊరేగింపు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.


స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందిస్తున్న సత్యనారాయణ

బుచ్చెయ్యపేట: విశాఖ డెయిరీ చైర్మన్ దివంగత ఆడారి తులసీరావు జ్ఞాపకార్థంగా విజయరామరాజుపేట జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతికి చెందిన 105 మంది విద్యార్థులకు విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. నాయకులు దొండా అచ్చియ్యదొర, వేపాడ మధు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపులకు రూ.32 కోట్ల లింకేజీ రుణాలు



ఏపీఎం లక్ష్మి

నాతవరం: డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు రూ.32 కోట్లకుపైగా ఈ ఏడాది ఇచ్చామని వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి తెలిపారు. గురువారం ఆమె సిబ్బందితో తన కార్యాలయంలో సమీక్షించారు. మండలంలో 1,632 డ్వాక్రా సంఘాలకు గాను, సక్రమంగా రుణాలు చెల్లించే సంఘం ఒక్కంటికి రూ.10 లక్షల చొప్పున బ్యాంకు లింకేజీ రుణం ఇస్తున్నామన్నారు. దీంతోపాటు స్త్రీనిధి రుణాలు 900 మందికి రూ.8 కోట్లకుపైగా ఇచ్చామన్నారు. ఉన్నతి పథకంలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు 156 మందికి రూ. 50 లక్షలకుపైగా రుణాలు ఇచ్చామని, మరో రూ. 10 లక్షలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. జిల్లాలోనే అధికంగా నాతవరం మండలంలో ఉన్నత పథకం రుణాలు ఇచ్చామన్నారు. వెలుగు సిబ్బంది వాసు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



సీమంతాల కార్యక్రమంలో సత్యసాయి భక్తులు

కె.కోటపాడు: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని కె.కోటపాడు సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు తెలిపారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక రామాలయం వద్ద గురువారం సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. జోన్–3 సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్ కశిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

సీఎంకు స్వాగతం



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ కోసం విశాఖ విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇక్కడ విమానాశ్రయంలో పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఈర్లె అనురాధ

– కె.కోటపాడు

వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం



పెండ్లి రాట వేస్తున్న ముత్యాల కుటుంబీకులు

రోలుగుంట: స్థానిక కొండపైన వేంకటేశ్వర ఆలయంలో వెంకన్న కల్యాణోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కల్యాణకర్త ముత్యాల పెద్దియ్య కుటుంబీకులు ఆచార సంప్రదాయబద్ధంగా పెండ్లిరాట వేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకూ జరిగే కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేస్తామన్నారు.

మట్టిరోడ్డు నిర్మాణానికి నడుం బిగించిన రైతులు



మట్టిరోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న గ్రామపెద్దలు, ప్రజా ప్రతినిధులు

కె.కోటపాడు: దశాబ్దాలుగా సరైన రహదారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రెండు గ్రామాల రైతులు తామే పరిష్కరించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం కావాల్సిన తమ జిరాయితీ స్థలాలను స్వచ్ఛందంగా ఇచ్చారు. సొంతంగా విరాళాలు సమకూర్చుకున్నారు. ఈ మేరకు మల్లంపాలెం–కొల్లివీధి గ్రామాల మధ్య 20 అడుగుల వెడల్పు మట్టిరోడ్డు నిర్మాణానికి అడ్డంగా ఉండే తాటిచెట్లను జేసీబీ సహాయంతో తొలగించే పనులను గురువారం ప్రారంభించారు. ఇటీవల మల్లంపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును రెండు గ్రామాల ప్రజలు కలిసి కోరారు. ఆయన సూచన మేరకు మట్టిరోడ్డు నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి మరలా బీటీరోడ్డు నిర్మిస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ తెలిపారు. రైతులు కొల్లి సత్యనారాయణ, సత్యం, వార్డు మెంబర్లు వంటాకు రాము నాయుడు, వంటాకు గోవిందరావు, మాజీ ఉప సర్పంచ్ బొడ్డు లక్ష్మీదేముడుబాబు పాల్గొన్నారు.

ఈ నెలాఖరుకు రెండో విడత రీసర్వే పూర్తి

కె.కోటపాడులో రీసర్వే వివరాలను తెలుసుకున్న అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ



రీసర్వే వివరాలను తెలుపుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

కె.కోటపాడు: అనకాపల్లి డివిజన్ పరిధిలో మొదటి విడతలో 92 గ్రామాల్లో రీసర్వే పూర్తవ్వగా, రెండో విడత 125 గ్రామాల్లో ఈ నెలాఖరుకు పూర్తవుతుందని ఆర్డీవో ఎ.జి.చిన్నికృష్ణ అన్నారు. కె.కోటపాడు రెవెన్యూ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. మండలంలో మొదటి, రెండో విడతల భూసర్వే వివరాలను తహసీల్దార్ జె.రమేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రీసర్వేలో ఒక్కో బృందం రోజుకు 20 ఎకరాల సర్వే చేయాలన్నారు. గ్రామంలో సర్వేకు సంబంధించిన విస్తృత ప్రచారంతోపాటు కచ్చితంగా రైతులకు గ్రామసభ నిర్వహించాలని సూచించారు. రైతులు తమ భూమి పత్రాలతో సర్వే బృందాలను సంప్రదించాలన్నారు. రీసర్వే పూర్తయిన తర్వాత రైతులకు 9(2) నోటీసులను అందించి, ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించి వాటికి పరిష్కారం చూపుతామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రమేష్, మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, ఆర్ఐలు జానకి, తరంగిణి పాల్గొన్నారు.

రీ సర్వేతో సమస్యల పరిష్కారం

మాకవరపాలెం: రీ సర్వేతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని సర్పంచ్ గవిరెడ్డి ప్రసాదరావు అన్నారు. తూటిపాల గ్రామంలో గురువారం చేపట్టిన డ్రోన్ సర్వేను ఆయన ప్రారంభించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

423 మందికి ఇళ్ల మంజూరుకు ప్రతిపాదన

నాతవరం: సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునే 423 మంది పేదలకు హౌసింగ్ స్కీం మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, వీఆర్వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న వారికి ఇల్లు మంజూరు చేస్తామన్నారు. దీనికి సంబంధించి రెవెన్యూ, హౌసింగ్ సంయుక్తంగా పరిశీలించి లబ్ధిదారుల జాబితా కలెక్టరుకు పంపించామన్నారు. ఉగాదిలోగా జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ పరమైన సమస్యలపై వచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. హౌసింగ్ జేఈ జోగారావు, ఆర్ఐ నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి. కృష్ణ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తాం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

బుచ్చెయ్యపేట: అన్ని గ్రామాల్లో వేసవి తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె అచ్చింనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి తెలిపారు. సీఎల్సీ చర్చి ఆధ్వర్యంలో చిన్నయ్యపాలెం, పెదపూడిలో మంచినీటి బోర్లు ఏర్పాటు చేశారు. సీఎల్సీ చర్చి ప్రతినిధి మహంతి సమక్షంలో గురువారం వారు ప్రారంభించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశాలతో తాగునీటి బోర్లు ఏర్పాటు చేసిన సీఎల్సీ చర్చి సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఎంపీటీసీల సంఘం మండలాధ్యక్షుడు దేవర అప్పారావు, సర్పంచ్ గోకివాడ వరకృష్ణ, ఎంపీటీసీ రాము, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, నాయకులు జగన్, రాజు, రాజబాబు పాల్గొన్నారు.

సభ్యత్వం ఉన్నవారికే చేపల వేట

ఇరువర్గాల జాలర్లకు ఎస్ఐ సూచన



రావణాపల్లి జాలాశయం వద్ద ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఎస్ఐ, వైఎస్సార్‌సీపీ నేతలు

గొలుగొండ: రావణాపల్లి జలాశయంలో సమస్య లేకుండా చేపల వేట నిర్వహించుకోవాలని ఎస్ఐ నారాయణరావు సూచించారు. ఇక్కడ జలాశయంలో గురువారం చేపల వేట సాగిస్తున్న సమయంలో ఇరు వర్గాల మధ్య తగాదా ఏర్పడింది. దీంతో ఎస్ఐతో పాటు జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యన్నారాయణ, ఏఎంసీ చైర్మన్ సత్యన్నారాయణ, చోద్యం సహకార బ్యాంక్ చైర్మన్ పెద్దిరాజుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఇరు వర్గాల ఫిర్యాదుల మేరకు సభ్యత్వం ఉన్నవారు మాత్రమే చేపల వేట చేసుకోవాలని ఎస్ఐ తేల్చిచెప్పారు. జాలర్లంతా ఐక్యంగా ఉండాలని జెడ్పీటీసీ తెలిపారు.

భాస్కరవర్మ నియామకంపై హర్షం

మాడుగుల రూరల్: అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ జిల్లా అధ్యక్షుడిగా ముకుందపురం గ్రామానికి చెందిన పెమ్మే భాస్కరవర్మ నియమితులయ్యారు. అగ్నికుల క్షత్రియ జాతీయ అధ్యక్షుడు నాగిడి సాంబశివరావు, రాష్ట్ర అధ్యక్షుడు చింతా రామకృష్ణల ఆధ్వర్యంలో ఇటీవల విశాఖలో జరిగిన సమావేశంలో తనను నియమించినట్లు వర్మ గురువారం తెలిపారు. సర్పంచ్ కర్రి గణేశ్, తదితర్లు హర్షం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ



చిన్నారి పాట వింటున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, సూపర్‌వైజర్లు

నాతవరం: అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టరు తనిఖీ చేస్తారని, ఆ లోపే పని తీరు మెరుగుపడాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. నాతవరం అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను స్టాకును క్షుణ్ణంగా పరిశీలించారు. చిన్నారులతో కొంతసేపు ముచ్చటించి వారి పాటలకు మాటలకు మురిసిపోయారు. సాయంత్రం 3:30 గంటల సమయంలోనూ 15 మంది చిన్నారులు ఉండటంతో కార్యకర్త సత్యవతి, ఆయా జ్యోతిలను అభినందించారు. అక్కడ ఆవరణలో పెంచుతున్న మాదిరిగానే మండలంలోని అన్ని కేంద్రాల్లో ఆకు కూరలు, వివిధ రకాల మొక్కలను పెంచాలన్నారు. లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించి రక్తహీనత లేకుండా చూడాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.